క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కస్తూరి ఎంపిక


ఎంపికైన విద్యార్థిని కస్తూరితో హెచ్‌ఎం, పీడీ

తాడిమర్రి: రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ బాలికల విభాగంలో దాడితోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇ.కస్తూరి ఎంపికైంది. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి సెలెక్షన్స్‌లో కస్తూరి ప్రతిభ కనబరచడంతో ఎంపిక చేశారు. ఈ నెల 30, 31 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఈమె పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయులు పి.ఉమామహేశ్వర్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయిని కె.జయలక్ష్మి తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లోనూ సత్తా చాటాలని ఉమామహేశ్వర్‌రెడ్డి, రంగయ్య, శివయ్య, పెద్దన్న, నాగలక్ష్మి, అస్మద్, నాగజ్యోతి తదితర ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

విద్యార్థికి సన్మానం


హేమంత్‌నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివి నీట్‌లో అర్హత సాధించిన కదిరి మండలం చవిటితండాకు చెందిన మూడే రవి నాయక్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మూడే హేమంత్‌నాయక్‌ను మంగళవారం గ్రామస్తులు సన్మానించారు. ఈ నెల 25న విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మొమెంటోతో పాటు రూ. లక్ష నగదు ప్రోత్సాహకం అందుకున్న సందర్భంగా ఈ విద్యార్థికి ఘనంగా సత్కరించారు.

స్థల పరిశీలన

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలో ఉద్యానవనం, శ్మశానం ఏర్పాటు కోసం తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి మంగళవారం పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు బీజేపీ ధర్మవరం అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసం.. బెదిరింపుపై ఫిర్యాదు

కదిరి టౌన్: తన బ్యాంక్ ఖాతాను సురేంద్ర నాయుడు అనే వ్యక్తి వాడుకుని.. మోసానికి పాల్పడ్డాడని, ఇదేమని అడిగితే బెదిరించాడని మున్సిపల్ పరిధిలోని రహమత్‌నగర్‌కు చెందిన పి.అష్రఫ్ అలీఖాన్ మంగళవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. తాను బెంగళూరులో ప్రైవేట్ ఉద్యోగం చేసే సమయంలో సురేంద్రనాయుడు తనతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఖాతా తెరిపించి.. అందులోకి ఉద్యోగాల కల్పన పేరిట ఇతరుల ద్వారా రూ.3,95,000 వేయించాడని.. తర్వాత ఈ సొమ్మును సురేంద్రనాయుడు ఖాతాలోకి మళ్లించుకున్నాడని పేర్కొన్నాడు. తర్వాత సదరు యువకులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. ఆ డబ్బు తిరిగివ్వాలంటూ బాధితులు తనను ఇబ్బంది పెట్టడంతో.. సురేంద్రనాయుడు నుంచి రూ.2లక్షలు రికవరీ చేయించానన్నాడు. మిగిలిన రూ.1,95,000 ఇవ్వాలని అడిగితే ఇచ్చేది లేదంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని అష్రఫ్ అలీఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం


విద్యార్థులతో తయారు చేయించిన మట్టి గణనాథులతో ఉపాధ్యాయులు

బత్తలపల్లి: పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకులనే పూజించాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని శ్రీజ్యోతి హైస్కూల్‌లో మట్టి వినాయక విగ్రహాల ప్రాముఖ్యతపై డైరెక్టర్ మిడతల ధర్మతేజ, కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


మట్టి గణపయ్యలు చూపుతున్న విద్యార్థులు

ధర్మవరం అర్బన్: మట్టి గణపయ్యలనే పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ నిర్మలాదేవి తెలిపారు. మంగళవారం హైస్కూలులో విద్యార్థులు స్వయంగా బంక మట్టితో గణపయ్యలను తయారు చేశారు. కరస్పాండెంట్ తో పాటు పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


ధర్మవరంలో పండుగ సరుకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

చవితి సందడి

- మండపాలకు తరలిన గణనాథులు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిట

కదిరి టౌన్: వినాయక చవితి పండుగ సందడి మొదలైంది. బుధవారం పండుగను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. బొజ్జ గణపయ్యలను కొలువుదీర్చడానికి మండపాలు సిద్ధం చేశారు. మంగళవారం వినాయక ప్రతిమలు కొనుగోలు చేసి ప్రత్యేక వాహనాల్లో మండపాలకు చేర్చారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో పండుగ సంబరం అంబరమంటనుంది.


కదిరిలో గణపతి ప్రతిమలను కొనుగోలు చేస్తున్న దృశ్యం


పుట్టపర్తిలో పండుగ సామగ్రి కొనుగోళ్లు


మామిళ్లపల్లిలో వినాయక మండప ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం


అశోక్ కుమార్ తయారు చేసిన మట్టి గణపతి

మట్టి మేలు తలపెట్టి..

పుట్టపర్తి అర్బన్: పర్యావరణ హితం ఆ యువకుడి అభిమతం. అందుకే ఏటా మట్టి గణపతిని తయారు చేసి.. కొలువుదీర్చి.. భక్తితో పూజలు చేస్తున్నారు. అలా 12 ఏళ్లుగా ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు పుట్టపర్తి మండలం బత్తలపల్లికి చెందిన అశోక్‌కుమార్. పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే మట్టి గణపతి ప్రాముఖ్యత తెలుసుకుని.. ఆ దిశగా ఇంటి వద్దే తయారీకి శ్రీకారం చుట్టాడు. అలా అడుగు నుంచి మొదలై క్రమక్రమంగా ఎత్తు పెంచుతూ గణేశుడి విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్దే స్థాయికి ఎదిగాడు. అందులో భాగంగానే ఈ ఏడాది వినాయక చవితిని పురస్కరించుకుని సమీపంలోని చెరువు నుంచి బంకమట్టి తీసుకొచ్చి వారం రోజుల పాటు శ్రమించి శివుని రూపంలో వినాయకుడిని సిద్ధం చేశాడు. రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాడు. దాదాపు ఏడు అడుగుల మేర ఉన్న ఈ మట్టి ప్రతిమ అందరినీ ఆకట్టుకుంటోంది. గ్రామస్తులు అశోక్‌కుమార్ కృషిని అభినందిస్తున్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు


దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. వినాయకుని అనుగ్రహంతో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు సిద్ధించాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్‌సీపీ నేత కుటుంబానికి పరామర్శ

గాండ్లపెంట: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మహమ్మద్ ఫరూక్ ఈ నెల 17న మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల వెంకటరమణ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ బత్తల హరిప్రసాద్ తండ్రి బత్తల వెంకటరమణ మంగళవారం గాండ్లపెంటలోని ఫరూక్ స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ హరిప్రసాద్ పంపిన రూ.25 వేల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బీసీ విభాగం నాయకులు జక్కల లక్ష్మీనరసింహాగౌడ్, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ చిగ్రప్ప పురుషోత్తంరెడ్డి, కాంట్రాక్టర్ బాబా, చంద్ర, బాబ్‌జాన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులకు జింక పిల్ల అప్పగింత


జింక పిల్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

బత్తలపల్లి: అప్పుడే పుట్టిన జింక పిల్లను కుక్కలబారిన పడకుండా ఓ పాత్రికేయుడు కాపాడి.. అనంతరం అటవీ అధికారులకు అప్పగించారు. మండల కేంద్రం బత్తలపల్లి సమీపాన కదిరి రోడ్డు వైపున గల ఒక పొలంలో మంగళవారం జింక ప్రసవించింది. దీన్ని గమనించిన కుక్కలు అటువైపు రావడంతో పిల్లను వదిలి జింక పారిపోయింది. అదే సమయంలో అటుగా వచ్చిన పాత్రికేయుడు మంజుల రాధాకృష్ణ రక్షించి ఇంటికి తీసుకెళ్లి పాలు తాపించారు. ఆ తర్వాత ఫారెస్టు అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. బీట్ ఆఫీసర్లు అక్కులప్ప, గిరి వచ్చి జింక పిల్లను స్వాధీనం చేసుకున్నారు. సంఘటనాస్థలాన్ని చూపాలని వారు కోరడంతో పొలం వద్దకు వెళ్లి రాధాకృష్ణ జింక ప్రసవించిన స్థలాన్ని చూపించారు. అక్కడ తల్లి జింకను వెతికినా ఎక్కడా కనిపించలేదు. దీంతో వారు ఆ జింక పిల్లను నేలకోట ఫారెస్టులో జింకల మందలో వదిలేసేందుకు తీసుకువెళ్లారు.

బాబు మోసాలను ఇంటింటా ప్రచారం చేయాలి


'కూటమి' మేనిఫెస్టోను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తాడిమర్రి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను ఇంటింటా ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాడిమర్రిలోని నివాసంలో మంగళవారం ఆయన ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీల నాయకులతో కలసి చంద్రబాబు సూపర్‌సిక్స్ సహా వందలాది హామీలు ప్రకటించారన్నారు. ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. దివ్యాంగుల పింఛన్లు తొలగించి వారి ఉసురు పోసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వితంతువులకు పింఛన్ మంజూరు చేయలేకపోతోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వర్థ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కుంటాల పుల్లయ్య, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, నాయకులు పాళ్యం వెంకటరమణ, యలక శ్రీనివాసరెడ్డి, సల్లాపురం బాల రమణారెడ్డి, వడ్డి లింగారెడ్డి, అల్లే సాయినాథ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పిట్టు పరమేశ్వర్ రెడ్డి, గుజ్జల హనుమంతు, మదమంచి మల్లికార్జున నాయుడు, పాటిల్ ప్రకాష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కునుకుంట్ల, పిన్నదరి ఎంపీటీసీ సభ్యులు పెద్దన్న, చంద్రబాబు, ఆత్మకూరు, నార్శింపల్లి సర్పంచులు శెట్టిపల్లి వెంకటనారాయణరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

3.95 టన్నుల ఎరువుల విక్రయాలు నిలిపివేత


ధర్మవరంలో ఎరువుల దుకాణంలో స్టాకు రికార్డు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ అధికారి కె.శ్రీనివాసులు, ఎస్‌ఐ గోపాలుడు, డీసీటీఓ సురేష్ కుమార్, ఏఓ ముస్తఫా తనిఖీ చేశారు. ఈ పోస్ యంత్రాలు, స్టాకు రిజిస్టర్, భౌతిక నిల్వలు, తదితర వాటిని పరిశీలించారు. నిల్వ ఉంచిన వాటిలో తేడా ఉన్న 3.95 టన్నుల ఎరువుల విక్రయాలను అధికారులు నిలుపుదల చేశారు. అదే విధంగా పోతుకుంట రైతు సేవ కేంద్రంలో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు.

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలోని ఎరువుల దుకాణాలను మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేశాయి. లైసెన్సులు, స్టాకు రిజిస్టర్, బిల్లు బుక్కులు తదితర వాటిని పరిశీలించాయి. రెండు షాపులలో స్టాకు వ్యత్యాసం కారణంగా రూ.17,84,210 విలువ చేసే ఎరువుల విక్రయాలను అధికారులు నిలుపుదల చేశారు. కార్యక్రమంలో కదిరి ఏడీఏ సనావుల్లా, తహసీల్దార్ నారాయణస్వామి, ఏఓ రవీంద్ర, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండలంలో రైతులకు అందాల్సిన ఎరువులకు డీలర్, దుకాణదారుడు కాని కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సురేష్‌కుమార్, సీఐ శ్రీధర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఏఓ మురళీ, ఎస్‌ఐ సత్యనారాయణతో కలసి తనిఖీ చేశారు. అనంతరం గోదాములో నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలించారు.

తాడిమర్రి: మండల కేంద్రంలోని శ్రీనివాస ఫర్టిలైజర్స్, ఎస్వీ ట్రేడర్స్, ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి వ్యవసాయ సిబ్బంది, పోలీసులతో కలసి తనిఖీ నిర్వహించారు.

ఆకట్టుకున్న నాటకం


పౌరాణిక వేషధారణలో విద్యార్థులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని రిషి పాఠశాలలో మంగళవారం గణేశ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 'ఎవరు గొప్ప' అనే నాటకం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వరూప్ సింగ్, డీన్ భాస్కర్‌రెడ్డి, సీఏఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయం మేరకే భూసేకరణ చేపట్టాలి


భూసేకరణ చట్టాలు తెలిపే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

ఎన్పీకుంట: ప్రజల అభిప్రాయం మేరకే పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు నాగిరెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం భూసేకరణ చట్టాలకు సంబంధించిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో భూసేకరణ చేస్తున్నాయని, వ్యవసాయ యోగ్యమైన సాగు భూములను కార్పొరేట్లకు దోచిపెట్టడమే ధ్యేయంగా పాలకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం సేకరించిన భూములలో ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేశారు? ఎంత మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు? ఎంత అభివృద్ధి చేశారో ప్రజలకు తెలపకుండా మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో సోలార్ నిర్మాణం పేరుతో వేల ఎకరాలు సేకరించారని, స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి రైతులను నట్టేట ముంచారని మండిపడ్డారు. పశువుల మేతబీళ్ల కోసం 500 ఎకరాలు కేటాయిస్తామని చెప్పి 5 సెంట్లు కూడా వదలలేదని గుర్తు చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రజాభిప్రాయం మేరకే పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ చేపట్టాలని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు స్వామిరెడ్డి, చిన్నమల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి

తలుపుల : మండల కేంద్రంలో రూరల్ డెవలప్‌మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా మూర్తి మదర్ థెరిస్సా జయంతి వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహుడు, ఆర్‌ఐ శ్రీనివాస్, ఎద్దులరాముడు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడ్చివేతపై ఫిర్యాదు

నల్లచెరువు: మండల కేంద్రంలోని నూరుద్దీన్ కాలనీలో డ్రెయినేజీని బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తి దౌర్జన్యంగా జేసీబీతో పూడ్చి వేయించాడని కాలనీవాసులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పూడ్చివేత కారణంగా మురుగు ముందుకు వెళ్లే మార్గం లేక ఇళ్లల్లోకి వస్తోందని తెలిపారు.

ఘర్షణ కేసులో నిందితుల అరెస్ట్

బత్తలపల్లి: బొగ్గుల వ్యాపారుల నుంచి కమీషన్ల కోసం ఘర్షణ పడ్డ ఇరువర్గాలకు చెందిన తెలుగు తమ్ముళ్లను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కట్టకిందపల్లికి చెందిన విశ్వనాథనాయుడుతో పాటు ఐదుగురిపైన, గంటాపురం గ్రామానికి చెందిన అప్పస్వామి అలియాస్ జగ్గూతో పాటు మరో ఇద్దరిపైన కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

దివ్యాంగులకు పింఛన్లు కొనసాగించాలి

ధర్మవరం రూరల్: మండలంలో అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు కొనసాగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దివ్యాంగులతో కలిసి సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు మారుతి, జేవీ రమణ, వెంకటస్వామి, ఎస్‌హెచ్ బాషా తదితరులు ఎంపీడీఓ సాయిమనోహర్‌కు వినతిపత్రం అందించారు. వంద శాతం వైకల్యం ఉన్న వారికి కూడా శాతం తగ్గించి పింఛన్లలో కోత విధించడం సరికాదన్నారు.

అటెస్టేషన్ పత్రాలు పోలీసు శాఖకు పంపండి

పుట్టపర్తి అర్బన్: వైద్య ఆరోగ్య శాఖలో రెగ్యులర్ ఉద్యోగులైన వారికి ప్రొబేషన్ పూర్తి కావాలంటే ఉద్యోగుల అటెస్టేషన్ పత్రాలను పోలీస్ శాఖకు పంపించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగంకు ఏపీ గెజిటెడ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు విన్నవించారు. మంగళవారం డీఎంహెచ్‌ఓకు ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు రామమోహన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

ఖాద్రీశునికి ప్రత్యేక పూజలు


స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి అర్చకులు సంతోష్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని వెండి రథంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస రెడ్డి, మహిళలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్లకు స్థలం కేటాయించండి

పుట్టపర్తి/ ఓడీచెరువు: మెడికల్ ఎమర్జెన్సీ కోసం సామగ్రి నిల్వ ఉంచుకునేందుకు షెల్టర్ కోసం బుక్కపట్నం, ఓడీ చెరువు మండల కేంద్రాల్లో స్థలాలు కేటాయించాలని 108 సిబ్బంది కోరారు. ఈ మేరకు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లోకు వినతిపత్రాలు అందజేశారు.

మల్బరీ సాగు విస్తారంగా చేపట్టాలి

ఎన్పీకుంట: తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఇచ్చే మల్బరీ సాగును రైతులు విస్తారంగా చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరరెడ్డి, సెరికల్చర్ టెక్నికల్ అధికారి బాబాఫక్రుద్దీన్ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతు షబానా సాగు చేసిన మల్బరీ పంటను అధికారులు పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గాండ్లపెంట: రెక్కమాను ఉన్నత పాఠశాలలో మంగళవారం పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్య అధికారి నాగేష్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌ఓ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఉంటేనే ఆరోగ్యంగా ఉండగలమన్నారు. పౌష్టికాహారం లోపం వల్ల శారీరక, మానసిక ఎదుగుల ఉండదన్నారు. ప్రతి విద్యార్థీ 'నేను–నా ఆరోగ్యం, నా లక్ష్యం' తప్ప ఇతర ఆలోచనలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ విజయకుమార్, ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌వలి, పీఈటీ హరూన్, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఏఎన్ఎం భవాని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు ఇవ్వాలి

ముదిగుబ్బ: మండలంలోని అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకులు ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో వీఆర్ఓ రేవతికి వినతి పత్రం ఇచ్చారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ముదిగుబ్బ: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మహేష్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కేజీబీవీ సమీపంలోని కాలనీలో ఉన్న స్టేడియం స్థలం ఆక్రమణలకు గురైందని వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ నారాయణస్వామి, మండల సర్వేయర్‌తో కలిసి ఆర్డీఓ పరిశీలించారు.

మండపాల వద్ద నిబంధనలు పాటించాలి


పీస్ కమిటీ సమావేశంలో సూచనలు ఇస్తున్న డీఎస్పీ

ఎన్పీకుంట: వినాయక చవితి పండుగ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులు మండపాల వద్ద నింబధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించి ఆయన పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నాగేంద్ర, గాండ్లపెంట ట్రైనీ ఎస్‌ఐ రవికుమార్, ఏఎస్‌ఐ కిషోర్‌రెడ్డి, సిబ్బంది, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, జామియా, మామూర్ మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాడిమర్రి: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఎంపీడీఓ వెంకట రంగారావు, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్‌శేఖర్‌నాయుడులతో కలసి వీఆర్‌ఓలు, కార్యదర్శులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు.

ధర్మవరం అర్బన్: వినాయక చవితి వేడుకలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తుండాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సచివాలయాల మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మహిళా పోలీసులు తమ పరిధిలో ప్రతిష్ఠించిన వినాయక మండపాల వద్ద పర్యవేక్షణ చేయాలన్నారు.

ప్రశాంతతకు సహకరించండి

బత్తలపల్లి: వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలు, గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి పండుగ సందర్భంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉత్సవ కమిటీ సభ్యులకు నిబందనలు వివరించారు.

చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి

చెన్నేకొత్తపల్లి: వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ సురేష్‌కుమార్, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సత్యనారాయణలు నిర్వాహకులకు సూచించారు. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం వినాయక కమిటీలు, ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు.

ముదిగుబ్బ: గణేశ్ ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పట్నం ఎస్‌ఐ జయరాం నాయక్ సూచించారు. మంగళవారం పట్నం పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల వారితో సమావేశం నిర్వహించారు.